అడ్డా.. అవస్థలు..!

• నిలువ నీడ లేదు... గుక్కెడు నీరులేదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ఐదు రోడ్ల కూడలి, రైల్వే స్టేషన్ పరిసరాలు, గడియారం ఆసుపత్రి వద్ద... ఉదయపు తొలి కిరణాల నుండి సాయంత్రం వరకు వందలాది మంది అడ్డా కూలీలు పని కోసం ఎదురు చూస్తుంటారు. వారిలో మహిళలు, వృద్ధులు కూడా ఉంటారు. ఎండ వేడిమి వారిని కాల్చుతున్నా, దాహం గొంతును ఎండిస్తున్నా... సేద తీరడానికి నీడ లేదు. గుక్కెడు నీరు లేవు. బిల్డింగ్ నిర్మాణ స్థలాల్లో శ్రమించే వీరు, తమ చెమటోడ్చి ఇతరులకు గూడు నిర్మిస్తున్నారు. కానీ వారికి మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రభుత్వాలు మారినా, హామీలు నీటి బుడగల్లాగే మిగిలిపోతున్నాయి.

'మాకు విలువనీడ లేదు. తాగేందుకు నీరు లేదు సారూ నిస్సహాయంగా అంటున్నాడు ధనుంజయ. గొందిపర్ల నుండి వచ్చిన ఈ అడ్డా కూలీకి ఇప్పుడు 50 ఏళ్లు ...గ్రామాల్లో పనులు లేక ఇక్కడికి రావాల్సి వస్తోంది. వేసవిలో తుంగభద్ర దాటి రావాలంటే నరకయాతన. ఆటోకు డబ్బులు లేకపోతే నడుచుకుంటూ రావాలి.' గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందని, తాము అధికారంలోకి వస్తే వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వారి మేనిఫెస్టోలోనూ దీనిని పొందుపరిచారు. కానీ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంటున్నా, ఆ హామీ మాత్రం నెరవేరలేదు. సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు కార్మికులు. సిఐటియు నాయకత్వంలో ఎన్నో ఏళ్లుగా జరిగిన పోరాటాల ఫలితంగానే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం వచ్చింది. అప్పటి సిపిఎం ఎంపీల అండతో పార్లమెంటులో ఈ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం, రూ. 10 లక్షల పైబడిన ప్రతి నిర్మాణ వ్యయంలో ఒక శాతం సెస్సును కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ నిధులు రూ. 4,298 కోట్లు ఉన్నాయని కార్మిక శాఖ మంత్రి స్వయంగా శాసనమండలికి తెలిపారు. అంటే, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించాల్సిన అవసరం లేదు. అయినా, గత వైసిపి ప్రభుత్వం జీవో 1214 ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేసింది. అప్పటి నుండి ఒక్క కార్మికుడికి కూడా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు అందలేదు. టిడిపి, జనసేన పార్టీలు ఈ జీవోను రద్దు చేస్తామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చాయి.

కర్నూలు అడ్డాలో ఉన్న కూలీలు (ఫైల్)

కార్మికుల డిమాండ్స్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. సెస్సు నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలి. గత ప్రభుత్వాలు దారి మళ్లించిన నిధులను తిరిగి చెల్లించాలి. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలి. గతంలో మంజూరైన పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేయాలి. అర్హులైన కార్మికులకు గృహ నిర్మాణానికి సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలి. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలి. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ. 10,000 పెన్షన్ ఇవ్వాలి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న మెరుగైన సంక్షేమ పథకాలను ఇక్కడ కూడా అమలు చేయాలి. కార్మికులు వేచి ఉండే అడ్డాలలో కనీస సౌకర్యాలైన నీడ, నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

వారంలో మూడు రోజులు మాత్రమే పని

- విజయకుమార్ ఆమడగుంట్ల, అడ్డా కూలీ

ఆమడగుంట్ల నుండి వచ్చిన విజయకుమార్ పరిస్థితి కూడా భిన్నంగా లేదు. 'మా ఊర్లో పని లేదు. ఇక్కడకు వస్తే ఉన్న కొద్దిపాటి పని కోసం మాలోనే పోటీ పెరిగిపోతోంది. పని దొరికితే మగవారికి రూ. 800, ఆడవారికి రూ. 600 ఇస్తారు. పేదరికం వల్ల చదువు మానేసి కూలి పనికి వస్తున్నాను. ప్రభుత్వ పథకాలు ఏమీ అందడం లేదు.'

లేబర్, ఈ శ్రమ కార్డు లేదు

- చిన్న మధు, రేమట

లేబర్ కార్డు లేదు, ఈ-శ్రమ్ కార్డు లేదు. దానితో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. నేను ఎనిమిదో తరగతి వరకు చదివాను. వర్షాకాలంలో వ్యవసాయ పనుల్లో అమ్మానాన్నలకు సహాయం చేస్తాను. పనులు లేనప్పుడు ఇక్కడకు వస్తాను. పని దొరికితే కడుపు నిండుతుంది, లేకపోతే లేదు. మా జీవితాల్లో వెలుగు నింపాలంటే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు తమ హామీలను నిలబెట్టుకుంటాయా? అడ్డా కూలీల కష్టాలు ఎప్పటికి తీరుతాయో వేచి చూడాలి.

ముడి సరుకులపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలి

- సయ్యద్ ఖాజా పాషా, ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు.

భవన నిర్మాణానికి ఉపయోగించే ముడి సరుకులు అయినటువంటి ఇనుము, సిమెంటు, ఇసుక, ఇటుక ,పెయింటింగ్ అలాంటి వాటిపై జీఎస్టీ ఇవ్వాలి. గడియారం ఆసుపత్రి వద్ద అడ్డా కూలీలకు మా కార్యాలయం వద్ద త్రాగునీటి వసతి కల్పించాం. ఎండ తీవ్రత ఉండే సమయాల్లో కార్యాలయం వద్ద నీడలో ఉండమని సూచించాం. భవన నిర్మాణ కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలి. ప్రభుత్వం వాడుకున్నభవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రభుత్వం వెనక్కి చెల్లించి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. ప్రమాదాలు జరిగి మరణం సంభవించిన వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలి.

తుంగభద్ర పై బ్రిడ్జి నిర్మించాలి

- ధనుంజయ, అడ్డా కూలి, గొందిపర్ల.

తుంగభద్ర నదిపై గోపాల్‌దిడ్డి దగ్గర టిజి వెంకటేష్ ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలో బ్రిడ్జి కోసం శంకుస్థాపన చేశారు. ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల ముందు పాలకులు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచాక మరిచిపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పై శ్రద్ధ ఉంచడం లేదు. బ్రిడ్జి నిర్మాణం చేస్తే కర్నూలుకు రాకపోకలు పెరుగుతాయి.

లక్ష్మీదేవి, జయమ్మ, గొందిపర్ల అడ్డా కూలీలు

లక్ష్మీదేవి, జయమ్మ వంటి ఎందరో మహిళా కూలీలు గొందిపర్ల నుండి రోజూ కర్నూలుకు వస్తారు. వారంలో కేవలం మూడు రోజులు మాత్రమే పని దొరుకుతుంది. రోజుకు వచ్చే రూ. 600తో కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉంది.కనీసం తాగడానికి నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో

11 మందికి జీవిత ఖైదు

- పోలీసు పహారాలో గ్రామాలు

- కుట్రపూరిత రాజకీయాలొద్దు : కంగాటి శ్రీదేవి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్/ వెల్దుర్తి

రాష్ట్రంలో సంచలనం రేపిన వైసిపి నాయకులు చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11 మందికి జీవిత ఖైదు పడింది. ఈనేపథ్యంలో వెల్దుర్తి మండలంలోని కొన్ని గ్రామాలలో హై అలర్ట్ ప్రకటించారు. పోలీసు బందోబస్తు పెంచారు. ఈ నేపథ్యంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తలు ఎవ్వరు కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడవద్దని సూచించారు. కుటుంబ పెద్దను కోల్పోయి తాము అనుభవించిన ధుఃఖాన్ని, బాధను ఎవ్వరూ అనుభవించరాదన్నారు.

కేసు పూర్వపరాలిలా ఉన్నాయి..... గురువారం 11 మంది ముద్దాయిలకు జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది తీర్పు వెల్లడించారు. 2017 మే 21న చెరుకులపాడు నారాయణరెడ్డిని ఘోరంగా హత్యచేశారు. ఈ హత్యకు సంబంధించి పోలీసులు విచారణ చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి తుది విచారణ చేపట్టి ఈ హత్య కేసులో ప్రధానంగా 11 మంది దోషులుగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించడమే కాకుండా జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ముద్దాయిలుగా ఉన్న వారిలో రామాంజనేయులు, బోయ రామనాయుడు ,కురువ రామకృష్ణ , బోయ బాలుడు , బోయ చిన్న ఎలప్ప, బోయ పెద్ద ఎల్లప్ప , వెంకటరాముడు, గంటల శ్రీను , రామాంజనేయులు, పెద్దభీసన్న రామాంజనేయులులకు జీవిత ఖైదీలుగా శిక్ష పడింది. ఒక్కొక్కరికి రూ 1,000 చొప్పున జరిమానా విధించారు. మొత్తం 19 మందిపై కేసు నమోదయింది. విచారణ సమయంలో ముగ్గురు చనిపోయారు. ఐదుగురిని నిర్దోషులుగా తేల్చారు.

చెరుకుల పాడు నారాయణ రెడ్డి హత్యానంతరం ఆయన భార్య కంగాటి శ్రీదేవి 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి పత్తికొండ ఎమ్మెల్యేగా పోటి చేసి గెలిచారు. ఎట్టకేలకు ఈకేసును ఎనిమిదేళ్ల తరువాత విచారణ పూర్తయి దోషులకు శిక్షపడింది.

పోలీసుల పహారాలో చెరుకులపాడు, మరి కొన్ని గ్రామాలు

వెల్దుర్తి : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో గురువారం కర్నూలు జిల్లా కోర్టు 11 మందికి జీవిత ఖైదు ఖరారు చేసింది. ఖైదీల బంధువుల రోదనలతో చెరుకులపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఎటువంటి గొడవలు అల్లర్లు జరగకుండా పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య పర్యవేక్షణలో సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ అశోక్ పోలీస్ సిబ్బందితో భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. వెల్దుర్తి మండలంలోని కొసనపల్లి గోవర్ధనగిరి రామళ్లకోట గ్రామాలలో పోలీసు సిబ్బందితో పికిటింగ్ ఏర్పాటు చేశారు.

కుట్ర పూరిత రాజకీయాలకు దూరంగా ఉండండి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కెఇ కుటుంబం స్వార్థ రాజకీయాలను నేను భర్తని, మా పిల్లలు తండ్రిని కోల్పోవడంతో పాటు, ఈరోజు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో 11 కుటుంబాల భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం తప్పు చేసిన వారిని ఎప్పటికైనా శిక్షిస్తుందని దివంగత నారాయణరెడ్డి హత్యకేసు తీర్పును చూసి తెలుసుకోవాలన్నారు. కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చట్టంపై తమకు ఉన్న విశ్వాసమే నేరస్తులకు శిక్షపడేలా చేసిందని చెప్పారు. నారాయణరెడ్డి బతికి ఉంటే ఎప్పటికీ ఎమ్మెల్యే కాలేను అన్న భయంతోనే కెఇ.శ్యాంబాబు కుట్ర చేసి హత్య చేయించారని ఆమె ఆరోపించారు. కెఇ కుటుంబం కుట్రకు ఈరోజు 11 మంది భార్యాపిల్లలకు దూరమై శిక్ష అనుభవించాల్సి వస్తుందని అన్నారు. తన భర్తను హత్య చేయించిన వారు కళ్లెదుట తిరుగుతున్నప్పటికీ అధికారంలో ఉన్నప్పటికీ మేము ఎప్పుడూ కూడా హత్య రాజకీయాలకు పాల్పడలేదని ఆమె గుర్తు చేశారు. ఏదేమైనా తమ ఎనిమిదేళ్ల నిరీక్షణ నేటికీ ఫలించిందని, నేరస్తులకు న్యాయస్థానం తగిన శిక్ష వేసిందని అన్నారు. ఎవరు కూడా కుట్రపూరిత రాజకీయాలకు, హత్య రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి చేసి ప్రజల మనసులు గెలుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు.

గ్రామంలో పహారా కాస్తున్న పోలీసులు

అవార్డును గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకుంటున్న కలెక్టర్ రంజిత్ బాషా

కలెక్టర్‌కు రెడ్ క్రాస్ అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా గవర్నర్ చేతులమీదుగా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు పురస్కారం లభించింది. బాపట్ల, కర్నూలు జిల్లాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలందించిన సందర్భంగా గురువారం విజయవాడ రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎపి స్టేట్ బ్రాంచి ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గడచిన రెండేళ్లలో కర్నూలు, బాపట్ల జిల్లాల్లో చేపట్టిన సేవలను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. కర్నూలు, బాపట్ల జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఆర్గాన్ డొనేషన్స్, మెడికల్ క్యాంపులు పల్స్ పోలియో, లెప్రసీ, ఎయిడ్స్ అవేర్నెస్ ర్యాలీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో గవర్నర్ ప్రత్యేకంగా కలెక్టర్‌ను అభినందించారు.

జి జి హెచ్ వైద్యులకు, సిబ్బందికి సెలవులు రద్దు

ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అత్యవసర సమయంలో వైద్య సేవలపరంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు ఆసుపత్రి వైద్యులకు, వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవడానికి వైద్యులు, వైద్య సిబ్బందికి అప్రమత్తం చేస్తూ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పై అధికారుల ఆదేశాల మేరకు సెలవులన్నీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారి చేశారు. అత్యవసర సమయంలో ఎలా వైద్యాన్ని అందించాలన్న దానిపై ఆసుపత్రుల్లో ఆక్సిజన్, మందులు, వెంటిలేటర్స్ అందుబాటులో ఉండి వైద్య సేవలకు అందరు సన్నద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారి చేశారు.

గూడూరులో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కత్రి వీధికి రంగస్వామి క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిపిఎం డివిజన్ కార్యదర్శి మోహన్ ఇంట్లో ఫ్యామిలీతో అనంతపురం జిల్లా యాడికి గ్రామంలో ఆయన వదిన ఇంట్లో ఫంక్షన్ ఉండడంతో భార్య పిల్లలతో వెళ్లారు. దొంగలు గమనించి ఇంట్లో ఎవరు లేని సమయం చూసుకొని మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి ఒక తులం బంగారు కమ్మలు, ఉంగరం, మెట్టెలు ,ముక్కు రాళ్లు దాదాపు నాలుగు తలాల బంగారు పోయిందని తెలిపారు. సిఐటియు డివిజన్ జె. మోహన్ మాట్లాడుతూ తాము ఇంట్లో లేని సమయంలో జరిగిన పరిస్థితిని చుట్టుపక్కల వారు గమనించి ఫోన్ చేయడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంప్లీట్ ఇచ్చానన్నారు. పోలీసులకు సంఘటన స్థలాన్ని చేరుకొని అక్కడ ఉన్న సిసి ఫుటేజ్‌ను తీసుకొని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెప్పారన్నారు.

దొంగ కు దేహశుద్ధి -భారీగా నగలు స్వాధీనం

ప్రజాశక్తి -సి బెళగల్ : సి బెళగల్ మండలంలో ఓ దొంగల చోరీలకు పాల్పడుతూ ప్రజల చేతికి చిక్కాడు. సి బెళగల్ లో ఆపిఉన్న బైకును ఎత్తుకెళ్తుండగా ప్రజలు గమనించి దేహశుద్ధి చేశారు. అక్కడి నుండి పారి పోతుండగా పరిగెత్తి పట్టుకొనే లోపు గంజాయి తీసుకుని స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిసింది. అతను నడుముకు చుట్టుకున్న చిన్న బ్యాగ్ లాక్కొని చూడగా విలువైన నగలు బయటపడ్డాయి. ఆ వెంటనే అక్కడి ప్రజలు ఆ వ్యక్తిని గూర్చి ఎస్ఐ పరమేష్ నాయక్ కు సమాచారం ఇవ్వగా నిముషాల్లో వాడిని అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులు ఆ వ్యక్తి కోడుమూరు అని పేరు అబ్దుల్ కలాం అని పోలీసులు ఆరా తీశారు. సుమారు 12 తులాలు బంగారు, నాలుగు తులాలు వెండి ఉన్నట్లు గుర్తించారు. ఈ దొంగ ఇంకా ఎక్కడెక్కడ చోరీ లకు పాల్పడు తున్నారని, ఒక్కడేనా ముఠా ఉందా అన్న కోణంలో కోడుమూరు, సిబెళగల్,గూడూరు పోలీసు వర్గాలు విచారణ చేస్తున్నారు. ఎవరైనా నగలు గాని పోయిన యెడల, ఇళ్లల్లో చోరీలు జరిగిన యెడల పోలీసుల దృష్టికి తీసుకోని రావాలని ఎస్ఐ పరమేష్ నాయక్ కోరారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

- పొగాకు రైతుల అడ్డగింపు

- రైతుసంఘం నాయకుల ఆగ్రహం

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

- జి.రామకృష్ణను అడ్డుకుంటున్న పోలీసులు

పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. రైతు సంఘం తీసుకొచ్చిన బ్యానర్‌ను, పొగాకు బేళ్లను మూడో పట్టణ పోలీసులు తీసుకెళ్లి ధర్నా చేయకుండా నిలువరించారు. పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లడాన్ని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న రైతు సంఘం నాయకులు మధుసూదన్‌ను మూడో పట్టణ సిఐ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రైతు సంఘం నాయకులు కొద్దిసేపు పోలీసులతో ఆందోళనకు దిగారు. పొగాకు రైతులను ఆదుకోవాలని ధర్నా చేస్తున్న రైతులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే మూడో పట్టణ సిఐ స్పందించి అక్కడికే రైతుసంఘం బ్యానర్‌ను తిరిగి పంపించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడారు. రైతులను మోసం చేసి పొగాకు కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకుని పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు సామరస్యంగా నిరసన చేసి గోడును విన్నవించుకోవాలని వచ్చిన రైతులను, రైతుసంఘం కార్యకర్తలను దౌర్జన్యంగా అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. గతేడాది రైతుల వద్దకెళ్లి ఐటిసి, జిపిఐ, విఎస్‌టి వివిధ కంపెనీల ఏజెంట్లు, వారి సిబ్బంది పొగాకు సాగు చేయాలని.. రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు గిట్టుబాటు ధర ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రైతులకు పర్మిషన్ ఐడి ఇచ్చి.. రైతులు పండించిన పొగాకును కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల కంపెనీ యాజమాన్యం, దళారులు రైతులను మోసం చేసి పొగాకు అసలైన ధర రూ.11 నుంచి 12 వేలు మాత్రమే వేస్తున్నారన్నారు. మరి కొంతమంది రైతులకు రూ.6 నుంచి రూ.8 వేలు మాత్రమే వేస్తున్నారని తెలిపారు. ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి సాగు చేసిన రైతులు లబోదిబోమంటుంటే ప్రభుత్వ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులు పండించిన పొగాకును పూర్తిగా కొనేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. కంపెనీలు, దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పొగాకు రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఒ వెంకటనారా యణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతుసంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, తాండ్రపాడు సర్పంచి బాలపీరా, రైతు సంఘం నాయకులు మధు, నాయకులు జి.ఆంజనేయులు, పంచలింగాల మాజీ సర్పంచి వెంకటేశ్వర్లు, చంద్రబాబు నాయుడు, మధుసూదన్, వీరేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లేబర్ కోడ్స్ రద్దు, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రచట్టం కోసం దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాల చేపట్టిన మే 20 వ తేదీన జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని రైస్ మిల్లు కార్మికులకు ఆ యూనియన్ కార్యదర్శి సిహెచ్ సాయి బాబా పిలుపునిచ్చారు. గురువారం కార్మిక కర్షక భవన్ లో రైస్ మిల్లు కార్మికుల విస్తృత సమావేశం ఎర్రమల అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరైన కర్నూలు నగర ఆయిల్, రైస్ మిల్లు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్, కార్యదర్శి సిహెచ్.సాయిబాబాలు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారను. వీటిని రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఇఎస్ఐ ,పిఫ్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సరలీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉంది. ఇతర 16 డిమాండ్ల కన్నా అన్నింటిలోనూ లేబర్ కోడ్లను అడ్డు కోవడం ప్రధాన అంశం లేబర్ కోడ్స్ అమలు లోకి వేస్తే చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు అందరూ బానిసత్వం లోకి నెట్టివేయబడతారని, లేబర్ కోడ్ల వేస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందని చెప్పారు. ఇవే కాకుండా కార్మికులు అనేక హక్కులు కోల్పోవాల్సి వస్తుందని, అందుకే కార్మికులు అందరూ ఒక్కతాటిపైకి వచ్చి మే 20 వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మికులు, గాలెన్న, హనుమంతు, శేఖర్, శివన్న, మద్దిలేటి, శేఖర్, వెంకటేశ్వర్లు, శేషన్న, ఓంకారం కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ ,సాయిబాబ

సమ్మెచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు ఇంజనీరింగు ఉద్యోగులు

కనీస వేతనం ఇవ్వాలి

మున్సిపల్ కాంట్రాక్టు ఇంజనీరింగు ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ ఇంజనీర్స్ కాంట్రాక్టు కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. యూనియన్ నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కులు ,వర్కింగ్ సెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ట్యాంకర్ డ్రైవర్లు, వాచ్మెన్లు, ఆఫీస్ స్టాఫ్ అందరూ ఉద్యోగులతో సమానంగా పనిచేసినా రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారు. కాంట్రాక్టు బేసిక్‌పై తీసుకొని పని చేయించుకుంటూ ఎదుగుదల లేకుండా ఉండిపోయామన్నారు. రిటైర్మెంట్ వయసు వచ్చినా అదే జీవితంతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేయించుకుంటూ తక్కువ జీతం ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని చెప్పారు. సక్రమంగా పనిచేయకపోతే ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరికలు చేస్తున్నారని తెలిపారు. నేటి నుండి 18 వ తేదీ వరకు వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేసి అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ నిరవధిక సమ్మెలో రాష్ట్ర కోశాధికారి సమీర్ బాష నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నగర ఉపాధ్యక్షులు నాగశేషులు, సుధాకర్, శివ, నరసింహ, జమాల్, రావూఫ్ మియా, సలీం, నాగరాజు, మస్తాన్, తిమ్మప్ప, శేఖర్, ఆంజనేయులు, ఎల్లప్ప, నాగేష్, మహబూబ్‌బాషా, షేక్షావలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

15 వరకు సిల్వర్ సెట్ గడువు పెంపు

రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -కర్నూల్ కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు పెంచుతున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం వర్సిటీలలో ఆయన ఛాంబర్ లో విలేకరులతో మాట్లాడుతూ సిల్వర్ సెట్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైన సెట్‌అని ఈసెట్ గురించి చాలా మంది విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశంతో గడువు పెంచామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారిని కూడా దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సిల్వర్ సెట్ అర్హత పరీక్ష ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పార్టీ పూర్వ వైభవానికి కృషి

- మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ మహ్మద్ గౌస్

ప్రజాశక్తి - ఆదోని

సందీప్ రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

పార్టీలో పదవులు పొందిన వారు వైసిపికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ మహ్మద్ గౌస్, వైస్ చైర్మన్ నరసింహులు పేర్కొన్నారు. గురువారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో సందీప్ రెడ్డిని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని 36వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డిని వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నియమించారని తెలిపారు. మరింత ఉత్సాహంతో పని చేయాలని కౌన్సిలర్ సందీప్ రెడ్డిని సన్మానించామని చెప్పారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సందీప్ రెడ్డి మాట్లాడారు. ఎంతో నమ్మకంతో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి తనకు బాధ్యతలు అప్పగించారని, విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని తెలిపారు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ అందరినీ కలుపుకొని సమర్థవంతంగా బాధ్యత నిర్వర్తిస్తానని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, అశోక్, ఉస్మాన్, చలపతి, వసీం, ఇంతియాజ్, నాయకులు గోవిందరాజ్, కిశోర్, రామకృష్ణ ఉన్నారు.

ఉపాధి పనుల ప్రారంభానికి చర్యలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

అవగాహన కల్పిస్తున్న ఉపాధి సిబ్బంది

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఉపాధి పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 'ప్రారంభానికి నోచని ఉపాధి పనులు' అనే శీర్షిక ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ రమణారావు ఉపాధి హామీ చట్టం ఏపీవో రాజు నాయక్‌తో మాట్లాడి పనుల కల్పనపై ఉపాధి సిబ్బందితో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడం వల్ల పొట్లపాడు గ్రామంలో పనుల కల్పనకు సీనియర్ మేటీ ద్వారా కూలీలకు ఉపాధి పనులు కల్పించి శుక్రవారం నుంచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి - నందవరం

వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్

ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సంజీవపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాలుని మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామస్తుల వివరాల మేరకు... శావాల శివ కుమారుడు అనోక్ (14) 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో, ఎండలు తీవ్రంగా ఉండడంతో రోజూ గ్రామంలోని పిల్లలు తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లేవారు. గురువారం కూడా స్నేహితులతో కలిసి అనోక్ ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత కొట్టే సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకోగా బాలుడు అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాలుని మృతిపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

అనోక్ (ఫైల్)

సచివాలయంలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలోని సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందున సెక్రటరీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రెవెన్యూ అధికారి అస్లాం బాష ఉన్నారు. అలాగే శరాఫ్ బజార్, మార్కెట్ ఏరియా, పార్కు రోడ్డులోని పలు ఏరియాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు.

పరిహారంపై నీలి నీడలు

- కొద్దిమందికే కరువు పరిహారం
- పెండింగ్ రైతులకు అందిస్తారా..?
- రైతుల ఆందోళన
- కేబినెట్‌లో అన్నదాత సుఖీభవపై చర్చ

ప్రజాశక్తి - హోళగుంద

వర్షాలు కురవకపోవడంతో 2023వ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు నష్టపోయారు. నష్టంపై అధికారులు అంచనా వేసి ఉన్నతాధికారులు పంపారు. కొద్దిమందికి మాత్రమే పరిహారం అందించారు. మిగిలిన రైతులకు పరిహారంపై స్పష్టత ఇవ్వడం లేదు. ప్రస్తుతం 'అన్నదాత సుఖీభవ'పై ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించింది. పరిహారం పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

2023వ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు, కాటకాలతో రైతులు పూర్తిగా నష్టపోయారు. ఆ ప్రభుత్వంలో రైతులు నష్టపోతే మనమెందుకు పరిహారం చెల్లించాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుకుంటుందో ఏమో కానీ దాని గురించి పట్టించుకోవడం లేదు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో 'అన్నదాత సుఖీభవ'పై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న 2023 ఖరీఫ్, రబీ సీజన్ నష్టపరిహారంపై ఊసే ఎత్తలేదు. వర్షాలు కురవక పంటలన్నీ ఎండిపోయి, పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రాలేదు. విత్తనాలు విత్తి మొలకెత్తి ఎండిపోయి పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కొర్రలు, జొన్నలు తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఎంత మేర నష్టం వాటిల్లిందో వ్యవసాయ శాఖాధికారుల ద్వారా సర్వే చేయించి సమగ్ర నివేదిక ఆధారంగా కరువు పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొంతమంది రైతులకు మాత్రమే కరువు పరిహారం అందించింది. మిగిలిన రైతులకు చేతులెత్తేయడం ఎంతవరకు సమంజసమని బాధిత రైతులు వాపోతున్నారు. రైతు శ్రేయస్సే తమ ధ్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు రైతులకు అప్పట్లో కొండంత నష్టం జరిగితే గోరంత పరిహారం అందించాయి. పరిహారం చెల్లింపులో కూడా పక్షపాతం చూపించాయి. కొంతమంది రైతులకు కరువు పరిహారం అందించి మిగిలిన రైతులకు చేతులెత్తేసినట్లు వాపోతున్నారు.

హామీలు నెరవేర్చడంతో ప్రభుత్వాలు విఫలం

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. గత 2023వ సంవత్సరంలో వర్షాలు కురవక కరువు కారణంగా కొండంత నష్టం వాటిల్లింది. బాధిత రైతులకు గోరంత పరిహారం అందించాయి. అది కూడా కొందరికే అందింది. మరికొందరికి అందలేదు. 50 ఎకరాలున్న రైతుకు సైతం ఐదెకరాల్లోపే పరిహారం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రతి రైతుకూ అందించకపోవడం బాధాకరం.

2023 ఖరీఫ్ సీజన్ ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు

మండలంలో 8,657.38 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. 8,819 మంది రైతులు ఉన్నట్లు, రూ.14,67,08,805 మంజూరైనట్లు రికార్డుల ఆధారంగా తెలిసింది. కరువు కారణంగా నష్టపోయిన రైతులందరికీ కరువు పరిహారం అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తవుతున్నా ఇంతవరకు పరిహారం అందని రైతుల గురించి మాట్లాడకపోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. తమకు కరువు పరిహారం అందుతుందా లేదా అని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిహారమందని మాట వాస్తవమే

- ఎడిఎ సునీత

2023వ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవక చాలామంది రైతులు నష్టపోయారు. నష్టపోయిన ప్రతి రైతూ వివరాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేకరించి నివేదిక పంపాం. కొంతమంది రైతులకు కరువు పరిహారం ఖాతాలో జమ అయింది. మిగిలిన రైతులకు వస్తాయో లేదో మాకు తెలియదు.

కరువు పరిహారం అందలేదు

- రైతు సవారప్ప, గజ్జహళ్లి గ్రామం

2023వ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో నాకున్న ఆరెకరాల్లో పత్తి పంట సాగు చేసి పూర్తిగా నష్టపోయాను. కరువు పరిహారం రూ.14 వేలు మంజూరైనట్లు వ్యవసాయ అధికారులు చెప్పారు. జాబితాలో తన పేరు కూడా ఉంది. ఇంతవరకు నాకు కరువు పరిహారం అందుతుందా లేదా అని అనుమానంగా ఉంది.

పరిహారం ఇవ్వలేదు

- రైతు దస్తగిరి

గత 2023లో కరువు కాటకాల వల్ల నష్టపోయిన పెండింగ్ పరిహారం ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. పరిహారం పరిస్థితి ఏమిటి.

మద్యం దుకాణం పరిశీలన

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

పత్తికొండ డివిజన్ ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సాయి ప్రవీణ్ గురువారం తెర్నేకల్ గ్రామాన్ని సందర్శించి మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గత మూడు రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలకు, బాలుర వసతి గృహానికి 100 మీటర్ల దూరం పరిధిలో ఉందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేదని స్పష్టం చేశారు.

యువజన కమిటీ అధ్యక్షులుగా తాహెర్ వలీ

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి యువజన మండల కమిటీ అధ్యక్షులుగా ఎం.తాహెర్ వలీని ఎంపిక చేయడం పట్ల వైసిపి నాయకులు, యువత గురువారం హర్షం వ్యక్తం చేశారు. యువజన కమిటీ ఉపాధ్యక్షులుగా దివాకర్ రెడ్డి, ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా సిద్ద రామ గౌడ్, రాఘవేంద్ర రెడ్డి, చాగి హనుమంతు, కార్యదర్శులుగా ఆనంద, గోవిందు, బంగారయ్య, తేజ వర్ధన్ రెడ్డి, హనుమేష్, మరి కొంతమందిని నియమించారు. తాహెర్ వలీ మాట్లాడుతూ... ఎమ్మెల్యే వై.బాలానాగిరెడ్డి, సీతారామి రెడ్డి, ధరణి రెడ్డి, ప్రదీప్ రెడ్డిలు ఈ పదవి తనకు రావడానికి కృషి చేశారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయబోమని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం గనేకల్లు గ్రామానికి చెందిన గౌల బంగారయ్య అనే వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందారని పోలీసు స్టేషన్ ఎస్ఐ గోపాల్ తెలిపారు. గురువారం ఉదయం ఇస్వీ, బి.కుప్పగల్ గ్రామాల మధ్య కెఎం నెంబరు 523/23బి24 వద్ద బంగారయ్య (35) మృతదేహం పడి ఉందని సమాచారం రాగా అక్కడ వెళ్లి పరిశీలించామన్నారు. మృతునిది గణేకల్ గ్రామమని గుర్తించమన్నారు. రైల్వే ట్రాక్ పక్కన మృతుని సోదరుడి పొలం ఉందని తెలిపారు. సాగు చేసిన కనకాంబరాల పంటకు నీరు పెట్టడానికి తెల్లవారుజామున ట్రాక్ దాటి వెళ్తుండగా గుర్తు తెలియని రైలు/గూడ్స్ తగిలి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారని విచారణలో తేలిందన్నారు. మృతునికి భార్య తాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించినట్లు చెప్పారు.

బకాయిలు చెల్లించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్ ఉద్యోగులకు కరువు భత్యం బకాయిలు చెల్లించాలని ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ఆదాయపు పన్ను చెల్లించినా 60 నెలల కరువు భత్యం బకాయిలు, 2023లో గ్రీన్ ఛానెల్‌లో ఉన్న 34 నెలల బకాయిలు చెల్లింపు ఊసే లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, మున్సిపల్ హైస్కూళ్లలో మంజూరయిన ప్రధానోపాధ్యాయుల, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఉరుసు ఉత్సవాలకు దర్గా ముస్తాబు

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వెలిసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలకు ముస్తాబయింది. 321వ ఉరుసు ఉత్సవాలకు దర్గా ధర్మకర్త మున్నా పాషా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. 10న గంధం, 11న ఉరుసు, 12న సప్రా షరీఫ్, 13న జియారత్ కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారన్నారు. ఈ ఉత్సవాలకు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ తదితర శాఖ అధికారులు సమన్వయంతో సహకరించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- మూడు రోజుల సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20, 21, 22న మూడు రోజులపాటు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పార్టీ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని, గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పిస్తామని.. కారుణ్య నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 మాసాలు అవుతున్నా కార్మికులను రెగ్యులర్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను, కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈనెల 21, 22న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.ఇస్మాయిల్, కె.ఖాజా, బడేషావలీ, బి.మునీంద్ర, కె.హరీష్, రంగస్వామి, బి.కేశన్న, తిక్కయ్య పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఫ్యాక్టరీ కాలుష్యంపై ఇఇ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో ఉన్న మారుతి ఇస్పాత్ స్టీల్ ఫ్యాక్టరీ వల్ల వెలువడుతున్న కాలుష్యంపై కాలుష్య విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిశోర్ రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఇస్పాట్ స్టీల్ ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న పొగ, బూడిద వల్ల చుట్టుపక్కల భూములు కలిగిన రైతులకు పంటలు పండక నష్టం జరుగుతోందని, సూగూరు గ్రామం సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి కాలుష్యంపై మాధవరం గ్రామానికి చెందిన పైబావి అమర్‌నాథరెడ్డి, రచ్చుమర్రి గ్రామానికి చెందిన మజ్జిగ శ్రీనివాసులు ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు, కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న రైతుల పొలాలను పరిశీలించారు. ఫిర్యాదు చేసిన రైతులను, చుట్టుపక్కల ఉండే రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం నిబంధనలు అమలు చేయడం లేదని, దీని నుంచి వచ్చే డస్ట్ పంట పొలాలపై పడుతున్నాయని, తమకు నష్టం వస్తోందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు పొలాల్లో పంటలు లేవని ఎలా గుర్తించాలని రైతులను ప్రశ్నించారు. వర్షాలు పడితే పొలాల్లో పంటలు సాగు చేస్తున్నప్పుడు వచ్చి విచారణ చేపడతామని రైతులకు తెలిపారు. రైతుల వివరాల ఆధారంగా జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు.

విచారణ చేపడుతున్న కిశోర్ రెడ్డి

పరిశీలనకు సూగూరు ఎస్ఎస్ ట్యాంకు నీరు

గ్రామ సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న బూడిద పడి నీరు కాలుష్యం అవుతోందని రైతులు ఫిర్యాదు చేయడంతో పొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిశోర్ రెడ్డి నీటిని పరిశీలనకు తీసుకెళ్లారు. నీటిని పరిరక్షించి నివేదికను జిల్లా అధికారులకు అందజస్తామని వారు తెలిపారు. విచారణకు వచ్చిన అధికారులు ఫ్యాక్టరీ లోపలకు వెళ్లకుండా రోడ్డుపైనే రైతులను విచారించి వెళ్లడంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులు పైబావి కృష్ణ మోహన్ రెడ్డి, పైబావి నర్సిరెడ్డి, ఉలువ లక్ష్మన్న, నవకోటి నారాయణ, నర్సిరెడ్డి, అయ్యప్ప, అంజిని, ఉలువ దుళ్లయ్య, భీమరాయుడు, నర్సిరెడ్డి, గుడిసె నరసింహులు, ఉలువ అయ్యన్న, గజలయ్య నర్సిరెడ్డి, ఎర్రకోట నాగప్ప, ఓంకార్ నర్సిరెడ్డి ఉన్నారు.

సర్పంచి ఇష్టారాజ్యం..!

- ఎల్లార్తి దర్గాలో టోల్‌గేట్ పేరుతో దోపిడీ

- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి - హోళగుంద

గ్రామాభివృద్ధికి పాటుపడాల్సిన సర్పంచి చాముండేశ్వరి సమీప బంధువులు దర్గప్ప, ఎస్‌కె.గిరి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టోల్‌గేట్ పేరుతో దోపిడీకి పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమ సంపాదనకు తెరలేపినట్లు గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా లారీకి రూ.120, ట్రాక్టర్‌కు రూ.100, కారుకు రూ.80, ఆటోకు రూ.50 ప్రకారం వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. గత నాలుగు నెలల క్రితం మాజీ ఉప సర్పంచి మల్లికార్జున రూ.2.5 లక్షలకు వేలంపాట ద్వారా టెండర్ దక్కించుకొని టోల్‌గేట్ వసూలు చేసి రూ.లక్ష వరకు పంచాయతీ ఖాతాలో జమ చేశారు. ఆ వ్యక్తిని తప్పించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చి రసీదు పుస్తకాలను గుంజుకున్నట్లు సమాచారం.

టెండర్ నిర్వహించరాదని అధికారులపై ఒత్తిడి

టోల్‌గేట్‌కు టెండర్ నిర్వహించకుండా తమ సామాజిక వర్గానికి చెందిన జిల్లా ప్రజాప్రతినిధితో డివిజన్ స్థాయి అధికారులకు ఫోన్లు చేయించినట్లు సమాచారం. పంచాయతీ అభివృద్ధికి పాటుపడాల్సిన సర్పంచి సమీప బంధువు అక్రమార్జన కోసం ఇంతకు దిగజారడం చూస్తుంటే గ్రామ పంచాయతీకి వచ్చిన నిధుల్లో కూడా ఎంత ఎంతవరకు స్వాహా చేశారో ఇట్టే అర్థమవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో జరిగిన నాడు-నేడు పనుల్లో సైతం వీరు చేతివాటం ప్రదర్శించినట్లు విమర్శలు వినిపించాయి. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి విచారణ చేసి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాహనాలు ఆపి అక్రమంగా వసూలు చేస్తున్న టోల్‌గేట్ దృశ్యం

టోల్‌గేట్ టెండర్‌కు సర్పంచి సహకరించడం లేదు

- పంచాయతీ కార్యదర్శి మహ్మద్ షఫీ

టోల్‌గేట్ టెండర్ నిర్వహించడానికి సర్పంచి సహకరించడం లేదు. గత రెండు నెలలుగా సర్పంచులు టెండర్ నిర్వహించడానికి డేట్ ఇవ్వాలని కోరిన ఎలాంటి స్పందన రాకపోవడంతో టెండర్ నిర్వహించలేకపోయాం. టెండర్ నిర్వహించకపోవడం వల్ల నాకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

చేనేత పురిలో చేనేతల అభివృద్ధి ఎక్కడ..?

- శిలాఫలకాల మోసం ఇంకెన్నాళ్లు : వైసిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టెక్స్‌టైల్ పార్కు పేరుతో గత పదేళ్లుగా పెట్టిన శిలాఫలకాలే మిగిలి, అభివృద్ధి ఒక్క అడుగూ ముందుకెళ్లడం లేదని వైసిపి నాయకులు మండిపడ్డారు. గురువారం వైసిపి ఇన్‌ఛార్జి బుట్టా రేణుక ఆదేశాల మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప మాట్లాడారు. 2014లో టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేశారని, మళ్లీ మరోసారి శిలాఫలకం, ఇప్పుడు మూడోసారి అని తెలిపారు. ఇప్పటివరకూ మట్టిలో ఒక్క గుట్ట కూడా తవ్వలేదని, ఇటీవల శిలాఫలకం వేసిన ప్రదేశంలో ముందున్న రెండూ మాయమయ్యాయని చెప్పారు. పార్కు ఎక్కడ, ప్రణాళిక దస్త్రాలు ఏమైనా ఉన్నాయా, నిధుల కేటాయింపులేమైనా జరిగాయా లేక ఎన్నికల ముందు మళ్లీ ఓటు కోసం డ్రామాలా అని ప్రశ్నించారు. సామాన్య చేనేత కార్మికుల జీవితాలతో మళ్లీ ప్రహసనం చేస్తారా అని నిలదీశారు. వైసిపి ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం' కింద లక్షల కుటుంబాలకు ఏటా రూ.24 వేలు నేరుగా ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేసి, మళ్లీ చేనేతపై ప్రేమ చూపుతున్నట్టు నటించడం తగదన్నారు. హెచ్.మురవణి సమీపంలో వైడబ్ల్యుసిఎస్ ఎమ్మిగనూరు వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలో పనిచేసే చేనేతలు ఇప్పటికీ పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీనిపై స్థానిక టిడిపి ఎమ్మెల్యేకు పలుమార్లు వినతులు అందించినా 'నాకు సంబంధం లేద'ంటూ చేతులు దులిపేశారని విమర్శించారు. పనులు దొరకక చేనేతలు హోటళ్లలో, సైకిల్ షాపుల్లో పని చేస్తున్నారని, మరికొందరు నీలకంఠేశ్వర స్వామి గుడి ముందు భిక్షాటన చేస్తున్నారని తెలిపారు. శిలాఫలకాలు కాదు.. నిజమైన అభివృద్ధి కావాలని హితవు పలికారు. వైసిపి మైనారిటీ విభాగం అధ్యక్షులు ఖాసీం బేగ్, నియోజకవర్గ ఐటి సెల్ అధ్యక్షులు మాచాని సోమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కరే రాము, కార్యదర్శి చంద్ర, జెరుబండి రఘువీర, రఘు, పామయ్య, నరసింహులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశప్ప

కౌతాళంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు

- ఎపియుడబ్ల్యుజె నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసు అధికారులు సోదాలు చేయడం పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు పడినట్లు అని ఎపియుడబ్ల్యుజె నాయకులు ఖాజా హుస్సేన్, ఆరిఫ్, అంజి మండిపడ్డారు. గురువారం కౌతాళం పాత్రికేయులు తహశీల్దార్ కార్యాలయంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సోదాలు చేయడం దారుణమని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విలేకరులను ఇబ్బందులు పెడుతూ పత్రిక స్వేచ్ఛకు భంగం కల్పిస్తున్నారని చెప్పారు. ఇలాంటివి సమాజ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. ఇలాంటి సోదాలు, సంఘటనలు ముమ్ముందు కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇస్సాక్, షుకూర్, ఆరిఫ్, ముక్తర్ బాష, ఆచారి అంజి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** డిప్యూటీ తహశీల్దార్‌కు జర్నలిస్ట్ యూనియన్ నాయకులు షబ్బీర్, ఉస్మాన్ బాష, నాగరాజు, అశోక్, దేవేంద్ర మూర్తి, నరసింహారెడ్డి, సోహెల్ వినతి పత్రం అందజేశారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు సహకరించండి

- ఎమ్మెల్యేకు వాల్మీకి నాయకుల వినతి

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటు చేయడానికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డిని వాల్మీకి నాయకులు కోరారు. గురువారం వారు ఎమ్మెల్యే బీవీకి వినతిపత్రం అందజేశారు. వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పెద్ద రాముడు, చిన్న రాముడు, లింగమూర్తి, తిమ్మరాజు, మోహన్, భీమన్న, గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని బల్లేకల్ గ్రామ సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శ్రీకృష్ణ విమర్శించారు. గురువారం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ చేస్తే దరఖాస్తు చేసుకుందామని వెళ్లిన ప్రజలకు అక్కడ సిబ్బంది ఎవరూ లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయని తెలిపారు. సమయపాలన, విధులను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

- ఎంపిడిఒ రమణారావు

ప్రజాశక్తి- దేవనకొండ

వలసలు వెళ్లకుండా ఉన్న చోటనే కలిపిస్తున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రమణారావు తెలిపారు. గురువారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీవో రాజు నాయక్, ఈసీ పెంచలయ్య, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమణారావు

రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి

- కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి - ఆదోని

కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్ల మధ్యనే ఎక్కువ కాలం నీరు నిలిచి బురదలో ఇబ్బందులు పడుతున్నామని శివశంకర్ నగర్ వాసులు వాపోయారు. గురువారం ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భారతి, వెంకటేష్, జనార్ధన్ మాట్లాడారు. శివ శంకర్ నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో కొన్నేళ్లుగా జీవిస్తున్నామని, ఇళ్లకు సంబంధించిన మున్సిపాలిటీ పన్ను చెల్లిస్తున్నామని తెలిపారు. తమ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం జరగలేదన్నారు. ఎన్నిసార్లు అడిగినా 'అదిగో.. ఇదిగో' అంటూ కాలయాపన చేస్తూ తమ కాలనీ పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో ఇళ్ల మధ్యన నిలవడం వల్ల దోమల బెడద తప్పడం లేదని తెలిపారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీని సందర్శించి కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. శివశంకర్ నగర్, మహాత్మ గాంధీ నగర్ ప్రాంతాల్లో అక్కడక్కడ సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేదని బిజెపి నాయకులు భీమ లింగప్ప తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి కూడా తీసుకెళ్లామని, త్వరలోనే పనులు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారని అధికారులకు వివరించారు. మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KURNOOL

E.P. No. 97/2019 in O.S. 671/09

Smt. Janaki Bai
.... Petitioner/D.Hr

Vs

Ganathe Ramesh Rao and other
.... Respondents/J.Dr

To,
J.D.R. No.1
Ganathe Ramesh Rao,
S/o. Ganathe Ramachandra Rao,
R/o. H.No. 76-99-1A, Radha Nagar,
Kallur, Kurnool - 518004.

పై కోర్టు యందు D.Hr. తనకు రావలసిన మనోవర్తి వసూళ్ళ నిమిత్తము పై E.P. నీపై దాఖలు చేసియుంటున్నారు. సదరు E.P. నీ హాజరు నిమిత్తము తేది 16-06-2025 ఉదయం గం॥ 10-30 ని॥లకు హాజరయి, ఏమై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది : 16-06-2025

M.D.V. Jogaiah Sarma
D.Hr. పరం అడ్వకేట్,
కర్నూలు.